# నెమరేసిన మెమరీస్



ఎమెస్కో

# శ్రీదేవి కల్యాణం

**అ**ర్ధ శతాబ్దం క్రిందటి సంగతి.

1963–65 మధ్యకాలంలో నేను ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రికలో సబెడిటర్‌గా పనిచేస్తుండే వాణ్ణి. మద్రాసు మౌంట్ రోడ్‌లోని ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్స్‌లో మా ఆఫీసు. అక్కడికి ఐదారు నిమిషాల నడక దూరంలో బాపుగారి ఆఫీసు. అప్పట్లో ఆయన ఒక అడ్వర్టయిజింగ్ కంపెనీలో ఆర్ట్ డైరెక్టర్‌గా పనిచేస్తుండేవారు. ఆయన మా ప్రభ వీక్లీలో కథలకి కూడా రెగ్యులర్‌గా బొమ్మలు వేస్తుండేవారు. ఆయన ఫోన్ చేసినప్పుడల్లా నేను వెళ్ళి బొమ్మలు తెచ్చి మా ఎడిటర్ ఇన్‌ఛార్జి బి.సి. కామరాజు గారికి ఇస్తూ ఉండేవాణ్ణి. అలా వారానికి ఒకటి రెండు సార్లు ఆయన్ని కలిసేవాణ్ణి. నిజానికి 1957 నుంచే బాపురమణలతో నాకు పరిచయం ఉంది గాని 1963 నుంచి సాన్నిహిత్యం పెరిగింది.

1960లోనే మా అన్నయ్య (నండూరి రామమోహనరావుగారు), రమణగారు ఇంచుమించు ఒకేసారి ఆంధ్రపత్రిక వీక్లీనుంచి బైటికొచ్చేశారు. అన్నయ్య బెజవాడలో కొత్తగా ప్రారంభించిన ఆంధ్రజ్యోతి దినపత్రికలో అసిస్టెంట్ ఎడిటర్‌గా చేరాడు. రమణగారు కొన్నాళ్ళు వెండితెర నవలలు రాసి, తర్వాత సినిమా రైటరైనారు.

1963లో ఆంధ్రజ్యోతి సర్క్యులేషన్ మేనేజర్ వి.వి.రాఘవయ్య గారు ప్రారంభించిన 'జ్యోతి' మాస పత్రిక సంపాదకవర్గంలో రామమోహనరావు గారు, రమణగారు, బాపుగారు, రావికొండలరావు గారు, వి.ఎ.కె.రంగారావుగారు చేరారు. వీళ్ళలో రాఘవయ్య గారు, రామమోహనరావు మాత్రం బెజవాడలో ఉండేవారు. మిగిలిన వాళ్ళందరూ మద్రాసులోనే. అప్పుడప్పుడూ బెజవాడలో ఉండేవారు. నేనూ రెండు మూడేళ్ళు 'జ్యోతి'కి చాలా రచనలు చేశాను.

సరిగా ఆ కాలంలోనే – 1963 సెప్టెంబరులో – మా నాన్నగారు శ్రీదేవికి ఏదైనా మంచి సంబంధం చూడమని నాకు ఉత్తరం రాశారు. శ్రీదేవికి మంచి ఫోటో తీయించి పంపమని నేను రాశాను. నాన్నగారు శ్రీదేవిని గుడివాడ తీసుకువెళ్ళి